

ఘట్‌కేసర్ రూరల్: కాచవానిసింగారంలో దరఖాస్తు ఫారాల కోసం జరుగుతున్న తోపులాట



ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్పలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న పురపాలక శాఖ కమిషనర్ హరిచందన.

# దరఖాస్తుల వెల్లువ

- ఫారాల కోసం తోపులాటలు
- ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళలు, వృద్ధులు
- కొన్ని చోట్ల అందరికీ ఒకే క్యూలైన్..
- సరిపోని దరఖాస్తు ఫారాలు
- కిటకిటలాడిన జిరాక్స్ సెంటర్లు
- తొలి రోజు 28,665 దరఖాస్తులు



ఘట్‌కేసర్ రూరల్: కాచవానిసింగారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి తదితరులు



పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన కేంద్రంలో దరఖాస్తు స్వీకరించి రశీదు అందజేస్తున్న అధికారులు

**మేడ్చల్ జోన్ బృందం, డిసెంబరు 28:** పలు సందేహాలు, అపనమ్మకాల మధ్య ప్రజా పరిపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంనియోజకవర్గ వ్యాప్తంగాగురువారం ప్రారంభమైంది.దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రశాంతంగానే జరిగినప్పటికీ ఆరు గ్యారంటీల అమలుపై అధికారుల్లో స్పష్టత కొరవడంపై ప్రజల్లో అపనమ్మకాలను కల్గించింది. ఒక పథకానికి ఒకే దరఖాస్తు సరిపోతుందా, అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు సరిపోతుందా అని ప్రజలు వాకబు చేయడం కన్పించింది. దరఖాస్తు తీసుకున్న అధికారులు రశీదు ఇస్తున్నప్పటికీ ఆ తర్వాత జరిగేది ఏంటని ప్రజల నుంచి వ్యక్తమైన సందేహానికి ఇంకా మార్గదర్శకాలు రాలేదని సమాధానం వచ్చింది. మార్గదర్శకాల అనంతరం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడమా, క్షేత్ర స్థాయికి వెళ్లి దరఖాస్తుల పరిశీలన చేయడమా అనే ఇంకా స్పష్టత లేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం మాత్రం తెల్ల కాగితంపై దరఖాస్తు తీసుకోవడంపై కూడా అపనమ్మకం ఏర్పడింది. ప్రజాపాలన దరఖాస్తు ఫారంలో కొత్త రేషన్ కార్డు కోసం ప్రామాణికత ఏమిటన్న సందేహం వ్యక్తం అయింది. చాలా మంది మేడ్చల్ నియోజకర్గంలోని దమ్మాయిగూడ, మేడ్చల్, నాగారం, గుండ్లపోచంపల్లి, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డారు. వారి ఆధార్ కార్డులో అడ్రస్ సొంత ఊరికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలా, ఇక్కడే దరఖాస్తు చేసుకోవచ్చా అనే సం దేహం వ్యక్తం చేశారు. ఈ సందేహం ప్రధానంగా రైతుబంధు విషయంలో వ్యక్తమైంది.

### విశేష స్పందన

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాపరిపాలన దరఖాస్తులు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో దరఖాస్తులు తీసుకున్నారు.చైర్‌పర్సన్‌లు మర్రి దీపికానర్సింహారెడ్డి, లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, కమిషనర్లు రాములు, త్రిల్లేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవో పద్మావతి ఆధ్వర్యంలో మేడ్చల్ మండలంలోని ఒక బృందం రాయిలాపూర్, బండమాదారంలో, తహసీల్దార్ శైలజ ఆధ్వర్యంలో మరో బృందం మునీరాబాద్ గ్రామంలో ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీవో రాజేష్ కుమార్ పరిశీలించారు. శామీర్‌పేట మండలంలోని ఎంపీడీవో వాణి గర్దాస్ ఆధ్వర్యంలో యాడారంలో, తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో తుర్కపల్లి గ్రామంలో, మూడుచింతలపల్లి ఎంపీడీవో వత్సలాదేవి ఆధ్వర్యంలో పోతారం గ్రామంలో, తహసీల్దార్ వాణి రెడ్డి ఆధ్వర్యంలో కేశ్వాపూర్ గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. తూంకుంట మున్సిపాలిటీలోని 16 వార్డుల్లో కమిషనర్ జేతూరామ్‌నాయక్ తెలిపారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ కావ్య దరఖాస్తుల స్వీకరించారు. అడిషనల్ డీసీపీ సీసీఎస్ లక్ష్మి, ఏసీపీ విజయ్ శ్రీనివాస్, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో గంటలోపే వెయ్యి ఫారాలు అయిపోయినట్లు అధికారులు ప్రకటించటంతో నిరాశతో ప్రజలు వెనుదిరిగారు. దరఖాస్తు ఫారాలు తీసుకోవటానికి, మళ్లీ ఇవ్వటానికి క్యూ లైన్‌లు పాటించకపోవటంతో వృద్ధు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తు ఫారాలు తీసుకున్న తర్వాత పూర్తి చేసి ఇచ్చేందుకు సహాయకులు లేకపోవటంతో ఏమి చేయాలో ప్రజలకు పాలు పోక అయోమయంలో పడ్డారు. కాచవానిసింగారంలో దరఖాస్తు ఫారాల పంపిణీలో తోపులాట జరిగింది. ఒక్కసారిగా అందరు ఎగబడటంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. కాచవానిసింగారం పంచాయతీ కార్యాలయంఆవరణలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ జయేందర్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలిసి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి పరిశీలించారు. కీసర మండలంలోని రాంపల్లిదాయరలోఎంపీడీవో గ్యామ, భోగారం గ్రామానికి తహసీల్దార్ అశోక్‌కుమార్‌ల అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించారు. ఘట్‌బోడుప్పల్ పరిధిలోని దరఖాస్తుల స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన పరిసరాల్లో జీరాక్స్ సెంటర్లు, ఈ సేవ కేంద్రాలు కిక్కిరిపోయాయి. పీర్జాదిగూడలో మేయర్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్య దరఖాస్తుల స్వీకరించారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో చైర్మన్లు చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్య దరఖాస్తుల స్వీకరించారు. బోడుప్పల్ నగరపరిధిలోని 12వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీ, 25వ డివిజన్ ఇందిరానగర్ కాలనీ, 7వ డివజన్ లక్ష్మీనగర్ కాలనీలో పురపాలన శాఖ కమిషనర్ దాసరి హరిచందన, అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్, బోడుప్పల్, పోచారం మున్సిపాటీల్లో జరిగిన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు.

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తు |
|---|---|
| మేడ్చల్ | 1022 |
| గుండ్లపోచంపల్లి | 1107 |
| తూంకుంట | 1478 |
| నాగారం | 1591 |
| దమ్మాయిగూడ | 848 |
| ఘట్‌కేసర్ | 1503 |
| పోచారం | 1653 |
| జహర్‌నగర్ | 4074 |
| పీర్జాదిగూడ | 2368 |
| బోడుప్పల్ | 4217 |
| **మండలం** | **దరఖాస్తులు** |
| మేడ్చల్ | 857 |
| శామీర్‌పేట | 1036 |
| మూడుచింతపల్లి | 428 |
| ఘట్‌కేసర్ | 466 |
| కీసర | 748 |
| **మొత్తం** | **28,665** |



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో దరఖాస్తు ఫారాలు అయిపోవడంతో వెనుదిరుగుతున్న మహిళలు

### రేషన్ కార్డుకు దరఖాస్తు లేదంటా..



దరఖాస్తులు చేసుకోవాలే అంటున్నరు కానీ,వివరంగా ఎవరూ చెప్పడంలేదు. వివరాలు చెప్పే వారే లేరు. ఆడోళ్లకు మొగళ్లకు వేర్వేరు లైన్‌లు ఏర్పాటు చేస్తనన్నరు. కానీ అందరినీ కలిసి ఒకే లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ముసలోళ్లకు కష్టమైతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.గ్యాస్ తక్కువ కావాలంటే రేషన్ కార్డు కావాలంట. దానికేమో దరఖాస్తు లేదంట. అన్నిటికి ఇస్తే బాగుంటది.

**-సుక్కమ్మ, ఎదులాబాద్.**

### దరఖాస్తు ఫారాల కోసం కొట్లాట



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అన్ని ఫ్రీ అని చెప్పి ఇప్పుడు కొట్లాటలు పెడుతుండ్రు. పొద్దుగాల వచ్చినా ఎవరికి దరఖాస్తు ఇయ్యాలే కూడా చెప్పడం లేదు. క్యూ లైన్ పెట్టకుండా దరఖాస్తుల ఫారాలు పంచుతుంటే కొట్లాటలు అవుతున్నాయి. ముసలొల్ల గురించి కూడా ఆలోచించాలే. ఓట్లప్పుడు కమ్మగా మట్లాడుతారు. అన్ని ఇప్పిస్తమంటరు. ఇప్పుడు ఒక్కడు లేడు. కష్టాలు లేకుండా చూడాలే.

**-భారతమ్మ, కాచవానిసింగారం**

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 28:** ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధి కాచవానిసింగారం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 66ను రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం పరిశీలించి ఎంత భూమి కబ్జాకు గురైందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు, గుడిసెలు వేస్తే వెంటనే స్వయంగా తొలగించాలని లేనిచో కూల్చివేతలు చేపడుతామని తెలిపారు. వెంటనే సదరు భూమిలో సూచిక బోర్డులతో పాటు ఫెన్సింగ్ వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 28:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు.జిల్లా సంక్షేమ అధికారి, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో దివ్యాంగులకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, విద్యాధికారివిజయకుమారి, జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి బలరామారావు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు కిరణ్, వినయ్, నర్సింహ, జిల్లా అధికారులు ఉమర్‌ఖాన్, మధుసుధన్ రెడ్డి, పాపారావు, సంఘం నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

## సారూ..మా గుడిసెలకు పట్టాలు ఇప్పించండి

**జవహర్‌నగర్, డిసెంబర్ 28:** సారూ..మా గుడిసెలకు పట్టాలు ఇప్పించి యాజమాన్య హక్కులు పొందేలా చూడాలంటూ అంటూ అరుంధతినగర్ గుడిసెల వాసులు ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరారు. కార్పొరేషన్‌లోని అరుంధతినగర్ ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం గుడిసెలకు యాజమాన్య హక్కులు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల్లారెడ్డి సానుకూలంగా స్పందించారు.

## నేడు దేవస్థానం భూములు లీజుకు వేలం

**శామీర్‌పేట, డిసెంబర్ 28:** శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని శ్రీరామచంద్రస్వామి దేవస్థానం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని వ్యవసాయ భూములను లీజుకు వేలం నిర్వహించనున్నట్లు ప్రధానాచర్చకులు పారునంది రాంమ్మోహన్‌శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామనారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

## న్యూ ఇయర్ పేరుతో హద్దు మీరొద్దు

**మేడ్చల్,డిసెంబర్28:** న్యూ ఇయర్ పార్టీల పేరుతో యువత హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ హనుమాన్ గౌడ్‌తో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ ఉల్లంగ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. డిసెంబర్ 31న రాత్రి పెద్ద ఎత్తున తమ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అయ్యప్ప స్వామికి ఎమ్మెల్యే పూజలు

**జవహర్‌నగర్/కీసర,డిసెంబర్ 28:** చీర్యాల్ గ్రామంలో చిందం నాగేశ్ ఆధ్వర్యంలో, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మేయర్ మేకల కావ్య నివాసంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజలో ఎమ్మెల్యే మల్లారెడ్డి,జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌తో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లారెడ్డిని సత్కరించారు.

## పాడి రైతులకు రుణాలు మంజూరు

**కీసర, డిసెంబర్ 28:**దీర్ఘకాలిక రుణాల కింద గొర్రెలు, డెయిరీ ఫామ్ కింద రుణాలను అందిస్తున్నామని మండల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల వ్యవసాయ సంఘం కార్యాలయంలో గురువారం 8మంది పాడి రైతులకు రూ.45లక్షల చెక్కులను చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రజా పాలనపై అవగాహన సదస్సులు

**శామీర్‌పేట,డిసెంబర్ 28:** రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై గురువారం శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట, మూడుచింతలపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సర్పంచ్‌లు బాలమణి, వనజశ్రీ నివాస్‌రెడ్డి, కుమార్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, వెంకన్న, శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉన్నారు.